

మంత్రాలచెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మంత్రాలచెరువును సందర్శించిన సబితారెడ్డి

సరూర్‌నగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మంత్రాల చెరువును గురువారం మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సుందరీకరణ పనులను పకడ్బందీగా చేపట్టాలని, చెరువు పరిసరాలను పూర్తి ఆహ్లాదభరితంగా తయారు చేయాలని అధికారులకు సూచించారు. వాకర్స్‌కు ఇబ్బంది కలుగకుండా చూడాలని, బతుకమ్మఘాట్ మెట్లకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, డీఈఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, ఎఫ్‌ఆర్‌వో సుధీర్, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.93లక్షలు మంజూరు

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని మాధవనగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లోని మాధవనగర్‌కాలనీ, శ్రీనిధికాలనీ, కర్మన్‌ఘాట్ పాత గ్రామంలో నూతన సీసీ రహదారుల నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ నిధులు రూ.93లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో ఆయా కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ధర్మకర్తలు అంజిరెడ్డి, మేక సురేందర్‌రెడ్డి, నాయకులు సదానంద్‌రెడ్డి, రవి ముదిరాజ్, ఉమామహేశ్వర్, కాలనీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ప్రతినిధులు శేఖర్‌రెడ్డి, సత్తయ్య, వసంత, మల్లేష్‌గౌడ్, బొంబాయి, రాజశేఖర్, మనోహర్ పాల్గొన్నారు.



సరూర్‌నగర్ చెరువుకట్టను పరిశీలిస్తున్న జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్

బహిరంగ ప్రదేశాలలో చెత్తను నియంత్రించేందుకు సైరన్ సీసీ కెమెరాలు: జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్

ఎల్బీనగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయడాన్ని నియంత్రించేందుకు సైరన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ చెప్పారు. సరూర్‌నగర్ చెరువు కట్టను గురువారం ఆయన పరిశీలించారు బహిరంగంగా చెత్త వేయడానికి ఏర్పాటు చేసిన సైరన్ సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయకుండా స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాత, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, ఏసీపీ రామ్‌దాస్, ఈఈ(ఎలక్ట్రికల్)పున్నానాయక్, డీఈఈ విజయ్‌కుమార్, నవీన్‌కుమార్, ప్రసాద్, ఎంటమాలజీ ఏఈ రాంబాబు పాల్గొన్నారు.

జంక్షన్లలో టాయిలెట్ల ఏర్పాటు చేయాలి

ఎల్బీనగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్‌ను లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎల్బీనగర్‌కు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్బీనగర్‌లో జంక్షన్ల వద్ద టాయిలెట్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు.

కొత్తపేట కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి

కొత్తపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): కొత్తపేట కాలనీల్లో ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జడ్సీ హేమంత కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. కొత్తపేట కాలనీల్లో ప్రధాన సమస్యలను జడ్సీ గురువారం పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బృందావన్‌కాలనీ వద్ద ఆగిన బాక్స్‌డ్రెయిన్ పనులను వెంటనే పునరుద్ధరించాలన్నారు. బాక్స్‌డ్రెయిన్ పనులతో గాయత్రీపురం నుంచి సుమారు 9 కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి పాడైందన్నారు. పాడైన దారులకు మరమ్మతులు చేట్టాలని కోరారు. కొత్తపేట పార్కులో ఆగిన సుందరీకరణ పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుజాత, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష

ఎల్బీనగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై ఉపకమిషనర్ జకియా సుల్తాన కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, సుజాతానాయక్‌లతో కలిసి గురువారం సమీక్షించారు. వర్షాలు కురిస్తే ఎక్కడ కూడా నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమలను అరికట్టేందుకు ప్రతికాలనీలో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని కార్పొరేటర్లు కోరారు. ప్రతి డివిజన్‌కు కొత్తగా వీధి దీపాలను మంజూరు చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్‌పోలీస్ అధికారులు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

టీన్‌షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

చంపాపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని రాజగోపురం పక్కన రథశాల పైకప్పు నిర్మాణం, దుర్గామాత గుడి నుంచి సంతోషిమాత ఆలయం వరకు ధాత జాలా యాదగిరిరెడ్డి సహకారంతో నిర్మించనున్న టీన్‌షెడ్ పనులకు గురువారం ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు అంజిరెడ్డి, బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, చీర తిరుమలేష్, చేగోని సురేష్‌గౌడ్, గూడూరు మధుసూదన్‌రెడ్డి, యాదగిరి, అర్చకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిగా గోవిందరావు బాధ్యతల స్వీకరణ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల ప్రత్యేక అధికారిగా గోవిందరావు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. బుధవారంతో ఎంపీటీసీల పదవీ కాలం పూర్తైన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వం మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. అందులో భాగంగా డీడీ అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి గోవిందరావును మండల ప్రత్యేక అధికారిగా నియమించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సీమంతం, అక్షరాభ్యాసం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 4వ వార్డులోని శాంతినగర్‌కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో పోషన్ అభియాన్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతివిజయేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పోషక ఆహార ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, ఆయా సునీత పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

సరూర్‌నగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): నీట్ పేపర్ లీకేజీతో పాటు విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ బాలాపూర్ మండలంలో విజయవంతమైంది. బంద్ నేపథ్యంలో అనేక విద్యా సంస్థలకు సెలవు ప్రకటించగా, పలు విద్యా సంస్థలు తెరిచి ఉండడంతో ప్రగతిశీల యువజన సంఘం తదితర విద్యార్థి సంఘాల ప్రతినిధులు ర్యాలీగా వెళ్లి వాటిని బంద్ చేయించారు. కార్యక్రమంలో పీవైఎల్ బాలాపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి కొల్లూర్ భీమేశ్, ప్రతినిధులు మహేశ్, నరేందర్, నర్సింహ పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో తరగతులను బహిష్కరిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు ప్రశాంత్, చైతన్యయాదవ్, శేఖర్‌యాదవ్

ఎల్బీనగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో..

ఎల్బీనగర్: సరూర్‌నగర్, కొత్తపేట, ఆర్‌కేపురం, చైతన్యపురి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో గురువారం చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. చాలా వరకు విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించగా తెరచి ఉంచిన కొన్ని పాఠశాలలు, కళాశాలలను ఎస్ఎఫ్ఐ విద్యార్థి ప్రతినిధులు మూసివేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్షుడు కానుగుల అరుణ్ మాట్లాడుతూ నీట్ లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి స్టాలిన్, విద్యార్థి నాయకులు వంశీ, నవీన్, ఉదయ్, పవన్, రమేష్, శ్రీను, శివ పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్: దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, సైదాబాద్ ప్రాంతాల్లో విద్యార్థి జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరాల ప్రశాంత్ ఆధ్వర్యంలో పర్యటించి స్వచ్ఛందంగా స్కూళ్లను, కళాశాలలను మూసివేయించారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేయాలని, అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖమంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన సమితి స్టేట్ కోఆర్డినేటర్ కొత్త రవి, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు నకిరెకంటి నరేందర్, ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు చైతన్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శేఖర్ యాదవ్, నాయకులు దిలీప్‌కుమార్, వినీల్, అనీల్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: విద్యా సంస్థల బంద్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో విజయవంతమైంది. నీట్ పరీక్షల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గుండె శివకుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, ప్రయణ్, సాయి, హరీష్ పాల్గొన్నారు.



ఎల్బీనగర్ ఉన్నత పాఠశాలలో తరగతులను బహిష్కరించి విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా..

పోలీస్‌స్టేషన్‌లో బాధితుడిపై పోలీసుల దాష్టీకం

● గదిలో పెట్టి చితకబాదిన వైనం, ఎస్ఐ దురుసు ప్రవర్తన

సైదాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు దాష్టీకం ప్రదర్శించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బాధితుడిని ఎస్ఐ గదిలోకి తీసుకువెళ్లి బూతులు తిడుతూ ఇతర సిబ్బందితో కలిసి రబ్బర్ బెల్ట్, కర్రలతో చితక బాదారు. దాంతో బాధితుడికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్థానిక నేతలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సమయంలో కూడా సదరు ఎస్ఐ బాధిత కుటుంబీకులను బెదిరించడం గమనార్హం. సింగరేణి కాలనీలో నివాసముండే బొందిలి రాంసింగ్(55) పండ్ల వ్యాపారి, రెండు నెలల క్రితం అతడి భార్య శకుంతల బాయితో ఇంటి పొరుగున ఉండే ఓ మహిళతో గొడవ జరిగింది. అదే రాత్రి రాంసింగ్ భార్య శకుంతల తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పక్కింటి మహిళ దాడి చేసిన కారణంగానే తన భార్య మృతి చెందిందని రాంసింగ్ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఆరోగ్య సమస్యలతోనే శకుంతల మృతిచెందినట్లు పోస్టుమార్టం నివేదిక వచ్చింది. ఇది తెలుసుకున్న రాంసింగ్ బుధవారం సాయంత్రం ఇన్‌స్పెక్టర్‌ను కలుద్దామని సైదాబాద్ పీఎస్‌కు వెళ్లాడు. ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో ఎస్ఐ సాయికృష్ణను కలిసేందుకు వెళ్లాడు. ఆలయ పూజారి క్షుద్ర పూజలు చేస్తున్నాడంటూ రాంసింగ్ ప్రచారం చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నాడని బుధవారం స్థానిక మహిళలతో కలిసి పూజారి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు నమోదు చేసుకున్న సదరు ఎస్ఐ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రాంసింగ్‌ను చూడగానే ఆగ్రహంతో ఊగిపోయాడు. కాలర్ పట్టుకుని బూతులుతిడుతూ గదిలోకి తీసుకువెళ్లాడు. ఫోన్ లాక్కొని స్టేషన్‌లో ఉన్న ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లతో కలిసి గదిలో లైట్లు ఆపివేసి బెల్ట్‌లు, కర్రలతో చితకబాదాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్థానిక నేతలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేశారు. సదరు ఎస్ఐ వారితో కూడా దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు, నేతలు పీఎస్ ఎదుట ఆందోళన చేసేందుకు సిద్ధం కాగా విషయం తెలుసుకున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్‌పాటిల్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఎస్ఐ తీరుపై ఆగ్రహించి బాధితుడి కుటుంబసభ్యులను, నేతలను సముదాయించారు.



ఉస్మానియా ఆస్పత్రి వైద్యుల రిపోర్ట్



తలకు గాయం చూపిస్తున్న రాంసింగ్

కాళ్లపై పడ్డా కనికరించలేదు..

తాను అనారోగ్యంతో ఉన్నానని కాళ్లమీద పడ్డా కనికరించలేదని బాధితుడు రాంసింగ్ ఆవేదన వ్యక్తం చేశాడు. నీవు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో.. నన్ను ఎవరూ ఏమి చేయలేరు.. చేస్తే వేరే పోలీస్‌స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ అవుతా అంటూ హుకుం జారీ చేశారని తెలిపాడు. ఫోన్‌లు సైతం గుంజుకున్నారని వివరించాడు. పోలీసులు కొట్టిన దెబ్బలకు నడువలేని స్థితిలో ఉన్నానని తెలిపారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. పోలీసులు కొట్టడంతో తలకు. శరీరంపై గాయాలున్నట్లు ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు రిపోర్టును మీడియా ప్రతినిధులకు చూపాడు.

7న లోయర్ ట్యాంక్‌బండ్ మైసమ్మ ఆలయంలో బోనాలు

● కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు

చంపాపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్ బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ ఆలయంలో ఈనెల 7న ఉదయం 11గంటలకు బోనాల జాతర నిర్వహిస్తున్నట్లు తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు తెలిపారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో గురువారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు హాజరై బోనాల జాతర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టమైసమ్మ అమ్మవారికి వేలాది మందితో కుమ్మర్లు తొలిబోనం ఎక్కించనున్నట్లు పేర్కొన్నారు. వరుసగా అమ్మవారికి 8వ సంవత్సరం కూడా కుమ్మర మహిళలు 501బోనాలతో జగదీష్ మందిర్ నుంచి పోతరాజులు, శివసత్తుల ఆటపాటలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మ వారికి బోనాలు సమర్పించనున్నట్లు జయంత్‌రావు తెలిపారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్, కోశాధికారి ఆమంచి రాజలింగం, బోనాల ఉత్సవ కమిటీ కన్వీనర్ ఎగిరిశెట్టి వీరయ్య, మహిళా కన్వీనర్ రాధారపు లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామన్‌కోల్ వీరేశం, రాష్ట్ర కార్యదర్శి జిల్లెల శంకర్, నాయకులు యంజాల చంద్రయ్య, ఆర్.ప్రభాకర్, కె.రవీందర్, ఎస్.అశోక్, ఎం.యాదయ్య, బీ.నాగరాజు, ఎం.సుభాష్, లింగం, జంగం పాల్గొన్నారు.



లోయర్ ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ బోనాల జాతర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జయంత్‌రావు, మల్కాజిగిరి దయానంద్

మద్యం మత్తులో యువకుడిపై ప్రజాప్రతినిధి కుమారుడి దాడి

● మీర్‌పేట్ పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు

సరూర్‌నగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ ప్రజాప్రతినిధి కుమారుడు రోడ్డుపై వెళ్తున్న యువకుడిపై దాడి చేసిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. నాదర్‌గుల్‌లోని భాగ్యనగర్ రైతు సహకార సంఘం డైరెక్టర్ నర్సింహారెడ్డి కొడుకు యశ్వంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి తన వాహనంలో ఆర్‌సీఐ రోడ్డులో వెళ్తుండగా మరో కారులో బాలాపూర్ చౌరస్తా వైపు నుంచి ఓ యువకుడు వెళ్తూ గట్టిగా హారన్ మోగిస్తూ ఆయన కారును ఓవర్‌టేక్ చేశాడు. దాంతో ఆగ్రహానికి గురైన యశ్వంత్.. తన వాహనాన్ని మరింత స్పీడ్‌గా తీసుకెళ్లి సదరు యువకుడి కారుకు అడ్డంగా నిలిపి, కారులో ఉన్న యువకుడిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆ యువకుడు సారీ చెప్పినా వినకుండా రోడ్డుపై అందరూ చూస్తుండగా వెంటపడి మరీ చితకబాదాడు. ఆ సమయంలో యశ్వంత్‌తో పాటు అతడి స్నేహితులు సైతం మద్యం మత్తులో ఉన్నారని, ఆయన వాహనంలో మద్యం బాటిల్ కూడా ఉన్నదని స్థానికులు చెప్పారు. పైగా అతడి వాహనంపై ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్నదని, పోలీసు సైరన్‌తో కూడిన హారన్ ఉన్నదని చెప్పారు. రోడ్డుపై ఈ గొడవ జరుగుతున్నంత సేపు ట్రాఫిక్ జామ్ అయింది. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా స్థానికుల సాయంతో బాధిత యువకుడు మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మైనర్‌తో ప్రేమ.. పెళ్లి పేరుతో ఫొటోలు

● ప్రశ్నించేందుకు వెళ్లిన బాలిక కుటుంబీకులపై కత్తితో దాడి

వనస్థలిపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మైనర్‌ను ప్రేమ, పెళ్లి పేరుతో దగ్గరైన యువకుడిని, ప్రశ్నించిన బాలిక కుటుంబ సభ్యులపై యువకుడి సోదరుడు కత్తితో దాడి చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం షేబానగర్‌లో నివసిస్తున్న మేకల శివ (22) అనే యువకుడు అదే ప్రాంతానికి మైనర్(17) ఇద్దరు ప్రేమించుకున్నారు. ఈనెల 3న ఇద్దరు కలిసి ఫొటోలు దిగి, పెళ్లి చేసుకున్నామంటూ కుటుంబ సభ్యులకు సందేశాలు పంపారు. ఈ విషయం గురించి ప్రశ్నించేందుకు బాలిక తల్లిదండ్రులతోపాటు సోదరులు మధు, బుజ్జి, శ్రీను, కోన్‌రెడ్డి కార్తిక్‌లు గురువారం శివ ఇంటికి వెళ్లారు. బాలిక గురించి ప్రస్తావించడంతో ఇరువర్గాల మధ్య గొడవ ప్రారంభమైంది. ఈ సందర్భంగా శివ సోదరుడు శ్రీకాంత్ కత్తితో, కార్తీక్‌పై దాడిచేశాడు. కడుపులో తీవ్రగాయం కావడంతో వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించిన బాలిక కుటుంబ సభ్యులు, వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

భక్తుడిగా వచ్చి ఆలయంలో చోరీ

● నాగోల్ జైపూర్ కాలనీ షిరిడీ సాయిబాబా ఆలయంలో ఘటన

కొత్తపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భక్తుడిలా ఆలయంలో ప్రవేశించిన దుండగుడు ఆలయంలో చోరీ చేసిన సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. నాగోల్ జైపూర్‌కాలనీ షిరిడీ సాయిబాబా ఆలయంలో భక్తుడిగా వచ్చిన వ్యక్తి ఎవరూ గమనించని సమయంలో వెండి సామగ్రి ఎత్తు కెళ్లాడు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం జైపురి కాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయానికి దుండగుడు భక్తుడిలా వచ్చాడు. గురువారం భక్తులు ఎక్కువగా రావడంతో అందరూ వెళ్లిపోయే వరకు అక్కడే ఉన్నాడు. భక్తులు అందరు వెళ్లిపోయిన తర్వాత అతడు లోపలికి వెళ్లి రూ 40 వేల విలువ చేసే వెండి దీపపు సమ్మెలు, ఇతర వెండి సామగ్రిని బ్యాగులో వేసుకుని వెళ్లిపోయాడు. సాయి సంస్థాన్ ప్రతినిధులు గమనించి సీసీ కెమెరాలు పరిశీలించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొలను వెంకట్‌రెడ్డి, కార్యదర్శి గుండా సోమయ్య, కోశాధికారి రంజిత్‌గౌడ్ రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.



సీసీ కెమెరాల్లో చిక్కిన నిందితుడు

ఒడిషా నుంచి నగరానికి గంజాయి సరఫరా ఓఆర్‌ఆర్ వద్ద 27 కిలోల గంజాయి పట్టివేత

● పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులతోపాటు మైనర్

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఒడిషా నుంచి నగరానికి గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులతో పాటు మైనర్‌ను టీఎస్ నార్కొటిక్స్ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టుకున్నారు. ఒడిషా మల్కాన్‌గిరికి చెందిన బలరాం థాలి (23), రాజు కశ్యప (20), విజయ్ హల్దార్ (22)లు కారులో నగరానికి గంజాయి సరఫరా చేస్తున్నారు. ఒడిషాకు చెందిన ఎర్టిగా కారు (ఓడీ 10 ఆర్ 1933)లో 27 కిలోల గంజాయిని సరఫరా చేస్తున్నాడు. ఈ సమయంలో కారు ఓనర్ కుమారుడు మైనర్ కూడా కారులో ఉన్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టీఎస్ నార్కొటిక్స్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కాపుకాసి పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు బ్రిడ్జి వద్ద కారును ఆపి తనిఖీ చేశారు. అందులో 27 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హయత్‌నగర్‌లో 16.3 కిలోల గంజాయి పట్టుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు

● కొత్త చట్టంలో తొలి కేసు నమోదు చేసిన పోలీసులు

హయత్‌నగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఒడిషా నుంచి హైదరాబాద్ దూల్‌పేట్‌కు తరలిస్తున్న 16.3 కిలోల గంజాయిన ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం హయత్‌నగర్ కెనరా బ్యాంకు చౌరస్తా వద్ద పట్టుకున్నారు. కేసును హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు కొత్త చట్టం భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్) ప్రకారం తొలి కేసును నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిషాకు చెందిన జయ్‌దేవ్(23) ప్రైవేటు బస్సులో 16.3 కిలోల గంజాయిని బ్యాగులో పెట్టుకుని దూల్‌పేట్‌లో డెలివరీ చేయడానికి వస్తున్నాడు. అందులో భాగంగా జయ్‌దేవ్ గురువారం మధ్యాహ్నం హయత్‌నగర్ కెనరా బ్యాంకు చౌరస్తా వద్ద ప్రైవేటు బస్సు దిగాడు. అప్పటికి సమాచారం ఉన్న ఎస్‌టీఎఫ్ పోలీసులు అక్కడ మాటు వేసి సిద్ధంగా ఉన్నారు. జయ్‌దేవ్ బస్సు దిగగానే పట్టుకున్నారు. వెంటనే అతడి వద్ద నుంచి గంజాయిని, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని దూల్‌పేట్‌లో ఇవ్వడానికి వస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల వద్ద పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి

చాదర్‌ఘాట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాబోయే బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మూసారాంబాగ్ డివిజన్‌లోని అమ్మవారి ఆలయాల వద్ద పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బొక్క. భాగ్యలక్ష్మీరెడ్డి కోరారు. గురువారం ఆమె జీహెచ్‌ఎంసీ సర్కిల్-6 శానిటేషన్ డీఈ వెంకటపతి రాజు, ఎస్ఎస్ గోవింద్‌రెడ్డి, జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఏలు శ్రీనివాస్, గణేశ్, సుభాష్, శ్రీనునాయక్, నర్సింగ్‌రావు, శ్రీను, అక్షయ్, ముజీబ్‌లతో పాటు ఆలయాల కమిటీ ప్రతినిధులు అమీత్, దేవేందర్, రవి, యాదగిరి, లక్ష్మణ్, ఉమేష్, మురళీ, సురేష్‌లతో సమావేశమై శానిటేషన్ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

సైదాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మాదన్నపేటలోని మధురాసనమ్మ, దుర్గాదేవి ఆలయ మూడవ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాదన్నపేట, కుర్మగూడ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బద్దం సమరసింహారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి ఆశయ సాధనకు కృషి చేయాలి

వనస్థలిపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహనరంగ ఆశయ సాధనకు కృషి చేయాలని కాపుసంఘం ప్రతినిధులు తెలిపారు. గురువారం కాపు యువత ఆధ్వర్యంలో మోహనరంగ 77వ జయంతి వేడుకలను వనస్థలిపురంలోని కాపు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు సంఘం నేతలు రంగ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు లేళ్ల అంజిప్రసాద్, పాలంకి సుబ్బారాయన్, ఐఎస్ కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, సంజయ్‌కుమార్, జగదగ్ని, వెంకటనారాయణ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్-3లో నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, శేఖర్‌రెడ్డి, అజ్మీర్ హరిసింగ్‌నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కార్యవర్గ సభ్యులు, జనసేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడికి..



వివేకానందుడికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, కార్పొరేటర్లు

సరూర్‌నగర్: స్వామి వివేకానంద వర్ధంతిని గురువారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ లలితానగర్ చౌరస్తాలో కార్పొరేటర్ ఎనుగుల అనీల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్యబీరప్ప, లార్స్ బీరప్ప, పద్మాఅంజయ్య, బీఆర్‌ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సైదాబాద్: సైదాబాద్, ఐఎస్‌సదన్, కుర్మగూడ, అక్బర్‌బాగ్ డివిజన్‌లలో వివేకానందుడి వర్ధంతిని నిర్వహించారు. ఎల్ఐసీకాలనీలో వివేకానందుడి విగ్రహానికి కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, ఐఎస్‌సదన్ డివిజన్‌లో ప్రెస్ కాలనీలో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళర్పించారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

చాదర్‌ఘాట్: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సాక్షిగా హిందువులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం మధురపురికాలనీ కోణార్క్ థియేటర్ చౌరస్తా వద్ద కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ లోక్‌సభలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను హిందూ సమాజం ఖండిస్తుందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలపై రాహుల్‌గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు ఆనంద్‌కుమార్, లక్ష్మీదేవి, మురళి, సుబ్బారెడ్డి, వెంకటేశ్‌చారి, అనంతచారి, శ్రీధర్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client Sri.M.Ravinder Reddy and others have filed a suit for Declaration, Recovery of Possession and for Perpetual Injucntion in O.S.No.921 of 2023 on the file of IIIrd Additional District Judge, R.R.District Courts at L.B.Nagar, in respect of Open Plot, in Sy.No.57/1, consisting of Room admeasuring 2000.00 Sq.yards situated at Mallikarjuna Nagar, Kharmanghat Village, Saroornagar Revenue Mandal, R.R.District against G.Chenna Reddy and & others with regard to the above mentioned land. The said G.Chenna Reddy and others have illegally grabbed and occupied my client's land and started construction. It is further submitted that my client has filed Two Interlocutory Applications in I.A.No.724 of 2023 for Ad-Interim Injunction from alienating or transferring, likewise my client has filed another I.A.No.725 of 2023 for not to change the nature of suti schedule property nor to construct. The above said defendants in the suit i.e. G.Chenna Reddy and 7 others who have no right and title over the same is proceeding with construction illegally without any right and title. The said I.A.'s as mentioned above are pending for enquiry. My clients has also filed Criminal Complaint in FIR.No.168 of 2024 Under Section 420,471,120-B, Read With 34 of IPC against the defendants in the suit who are arrayed as accused in the above crime and the same is pending for investigation, apart from the same there are many other crimes registered against G.Chenna Reddy and others, in Remand case diary in Crime No.168 of 2024 .

2. The General Public are hereby informed not to enter into any kind of transaction with (1)G.Chenna Reddy (2) G.Lalithamma (3) E.Venkateswarlu, (4)E.Kavitha, (5) M/s.Mahalakshmi Constructions, Rep.by its Managing Partner, M.Tirumala Reddy. As the said property exclusively belongs to my client which was grabbed by G.Chenna Reddy and others. Inspite of this caution notice if any person ventures/purchase of the said property they will be doing so at their own risk, peril cost and consequences arising therefrom. The matter is subjudice and pending before the IIIrd Additional District Judge, R.R.District Courts at L.B.Nagar.

M/s.S.R.SANJEEV KUMAR
K. PAVAN KUMAR
BADRA NANAVATH
ADVOCATES Off:Flat No.104, 1st Floor, BRUNDAVAN, Prashanth Nagar, Beside Bharath Petrol Pump Lane, Moosarambagh, Hyderabad-500036
Cell.No.9848086188

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786